క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : సమాచార హక్కు చట్టం -2005పై ఏఓ రవిప్రకాష్ సోమవారం మండల రైతులకు తన కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద ప్రతి పౌరుడు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని అడిగి తెలుసుకొవచ్చన్నారు. పౌరులు అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలోగా సిబ్బంది తప్పనిసరిగా అందజేయాలన్నారు. 30రోజుల్లో ఆ అధికారి సమాధానం ఇవ్వకపోతే పౌరుడు నేరుగా సమాచార హక్కు చట్టం కమిషనర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

సమయపాలన పాటించండి



రికార్డులను పరిశీలిస్తున్న దశ్యం

గడివేముల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని నంద్యాల జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శారద బాయి సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కిరణ్‌కు సూచించారు. అలాగే ఆసుపత్రిలోని టీబీ రికార్డులను పరిశీలించారు. టీబీ రోగుల ఆరోగ్యాన్ని పరిశీస్తూ ఉండాలని, మందులు సక్రమంగా అందజేయాలన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్ : గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో సోమవారం కోడుమూరు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా చనుగొండ్లకు చెందిన బోయ ఉరుకుందును అదుపులోకి తీసుకుని రూ.4,500వేలు విలువ చేసే 24మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. దాడుల్లో కోడుమూరు ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

గణితంపై క్విజ్ పోటీలు



నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్ : మండలంలోని అమడగుంట్ల హైస్కూల్‌లో పూర్వ విద్యార్థి, గణిత ఉపాధ్యాయుడు ఆనంద్ సోమవారం విద్యార్థులకు గణితంపై క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు కాశీవిశ్వనాథ్, ఉదయ్‌కుమార్, సునీల్ కుమార్‌కు మొదటి, రెండవ, మూడవ బహుమతులుగా రూ.5 వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు బహుమతులను హెచ్ఎం అనంతయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయుడు ఆనంద్ అందజేశాడు. అలాగే ఇదే పాఠశాల పూర్వ విద్యార్థి ఉపాధ్యాయుడు నవాజ్ హైస్కూల్‌కు రూ.15 వేలు విలువ బీరువాను విరాళంగా అందజేశారు.

9 నుంచి తిరుమలకు పాదయాత్ర

కర్నూలు కల్చరల్: భక్తి చైతన్య పాదయాత్ర కమిటీ ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీ నుంచి తిరుమలకు పాదయాత్ర చేపట్టినట్లు కమిటీ సభ్యులు పాలూరి శివయ్య, ఎం.కె. శ్రీనివాసులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది 13వ సారి వేంకటేశ్వర స్వామి రథంతో పాటు భక్తి చైతన్య మాహా పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 7 గంటలకు కర్నూలు ఓల్డ్‌సిటీలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. 850 మంది భక్తులు 12 రోజుల పాటు పాదయాత్ర చేసి తిరుమలకు చేరుకుంటారని చెప్పారు. నవంబర్ 21వ తేదీన స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. పాదయాత్రలో పాల్గొనాలనుకునేవారు, మరిన్ని వివరాలకు 94408 74322, 91544 43337 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ బదిలీ

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ అంకిరెడ్డి తన మాతృ శాఖ హెల్త్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం తన చాంబర్‌లో ఆయనకు వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ముందుగా బదిలీపై వెళ్తున్న డాక్టర్ అంకిరెడ్డిని మున్సిపల్ కమిషనర్, అధికారులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

భోగేశ్వరుని దర్శనం.. సర్వపాప హరణం

- దక్షిణ కాశీగా వెలుగొందుతున్న క్షేత్రం
- భోగభాగ్యాలిచ్చే భోగేశ్వరుడిగా ప్రసిద్ధి
- 2వ తేదీ నుంచి కార్తీక మహోత్సవాలు
- ముస్తాబవుతున్న భోగేశ్వరాలయం



భోగేశ్వరాలయం



ఆలయప్రాంగణంలో అన్నచెల్లెళ్ల విగ్రహాలు



పూజలందుకుంటున్న భోగేశ్వరుడు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సమీపాన ఎర్రకనుమ కొండల్లో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామి దర్శనం సర్వపాపహరణం అని ప్రతీతి. భోగభాగ్యాలు ఇచ్చే భోగేశ్వరుడిగా భక్తులు ఆరాధిస్తారు. దక్షిణ కాశీగా పేరొందిన ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కాశీలో తప్పా మరే క్షేత్రంలో లేని కాలభైరవుడు భోగేశ్వరంలో ఉన్నందున ఈ క్షేత్రం దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచింది. పూర్వం ఇక్కడ భోగోలు అనే గ్రామం ఉండడంతో ఈ క్షేత్రానికి భోగేశ్వరం అనే పేరు వచ్చినట్లు పూర్వికుల సమాచారం. భోగేశ్వరుని దర్శనం సర్వపాపహరణం అనేందుకు పూర్వం జరిగిన కథ ప్రచారంలో ఉంది. భోగోలు గ్రామంలో పేద దంపతులకు అబ్బాయి, అమ్మాయి సంతానం. పిల్లలు చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయారు. దీంతో అన్నాచెల్లెలు అనాథలయ్యారు. సంతానములులేని దంపతులు చిన్నారులను వేర్వేరుగా చేరదీశారు. ఒకరికి ఒకరు తెలియని పరిస్థితులలో పెద్దవారయ్యారు. వీరి పుట్టుక విషయం తెలయక పెద్దలు అన్నా,చెల్లెలికి వివాహం చేసినట్లు పురాణాల కథనం. ఈ దంపతులు పడకగదిలోకి వెళ్లే ప్రయత్నంలో పక్కనే ఉన్న లేగ ఆవుదూడ తోకను వరుడు తొక్కుతాడు. అప్పుడా దూడ తన తల్లితో అమ్మ వీడు నాతోక తొక్కినాడే అంటుంది. సొంత చెల్లినే పెళ్లి చేసుకున్నోడు ముందూవెనుకా చూసుకోడులే అంటుంది దూడ తల్లి. ఈ మాటలువిన్న వరుడు కలత చెందుతాడు. తాము తెలియక తప్పు చేశామని వేడుకోగా అప్పుడు ఆవు కనికరిస్తుంది. విభండ మహర్షి కుమారుడు ఋష్యశృంగ మహర్షి వద్దకు వెళ్లి శరుణు వేడుకోమని సూచిస్తుంది. ఈ మేరకు ఆ దంపతులు ఋషి వద్దకు వెళ్లగా వారికి తలంబ్రాలు, పసుపుపచ్చని వస్త్రాలు ఇస్తాడు. బ్రహ్మముడితో అన్ని క్షేత్రాలలోని కొనేరులలో స్నానం చేయాలని, ఎక్కడైతే మీ పసుపు వస్త్రాలు తెల్లగా మారుతాయో అప్పుడు పాపపరిహారం అవుతుందని ఋషి చెప్పి టన్లు నానుడి. దీంతీ వారు అన్ని క్షేత్రాలు తిరిగుతూ వృద్ధులు అవుతారు. ఓపిక నశించిన వీరు చివరగా దుర్గాభోగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని ఇక్కడ ఉన్న పంచామృత కోనేరులో స్నానం చేస్తారు. అప్పుడు వస్త్రాలు పసుపు వర్ణం పోయి తెల్లగా మారతాయి. వీరు పాపవిముక్తి పొందారని పూర్వికుల కథనం. దీంతో భోగేశ్వరుని దర్శనం సర్వపాపహరణం అని భక్తుల నమ్మకం.

నవంబర్ 2 నుంచి కార్తీక మాసం పూజలు

దుర్గాభోగేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 2 నుంచి డిసెంబర్ 12వ తేది వరకు ప్రత్యేక పూజలు జరుగనున్నాయి. ఈ మేరకు ఆలయం ముస్తాబవుతుంది. భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రామానుజన్, ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ తెలిపారు. నవంబర్ 4వ తేదీ మొదటి సోమవారం స్వామివారికి తెల్లవారుజామునే అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. అదే రోజు సాయంత్రం గడిగరేవుల గ్రామంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 11వ తేదీ రెండవ సోమవారం ఉదయం స్వామివారి కళ్యాణోత్సవం అంత్యంత వైభవంగా జరుగనుంది. 18వ తేది మూడవ సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవం ఉంటుంది. 25వ తేదీ నాల్గవ సోమవారం భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు ఉంటాయి. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ చెప్పారు. కార్తీక మాసంలో ప్రతిసోమవారం ఆలయానికి వచ్చే భక్తుల కొరకు నంద్యాల, నందికోట్కూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఉంటాయని వివరించారు.

భోగేశ్వరుడి దర్శించుకుంటే పాపాలు తొలగుతాయి



కార్తీకమాసం సందర్భంగా భోగేశ్వరుడిని, అమ్మవారిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయి. భక్తులు కూడా చాలా నమ్మకంతో స్వామివారిని దర్శించుకుంటారు. భోగేశ్వరుడిని దర్శించుకుని ప్రతి ఒక్కరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు. కార్తీకమాసంలో స్వామి వారిని దర్శించుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేస్తున్నాం. – శ్యాంసుందర్‌శర్మ, ప్రధాన అర్చకులు, భోగేశ్వరం

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

కార్తీకమాసం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నాం. తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు అనుగుణంగా మౌలిక వసుతులు కల్పిస్తున్నాం.
– రామానుజన్ ,ఈఓ, భోగేశ్వరాలయం

నేడు పోలకల్‌లో రెవెన్యూ సదస్సు

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రీ సర్వేలో భాగంగా తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి మంగళవారం కంబదహాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవానలి సూచించారు.

నేడు రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

సి.బెళగల్: మండల పరిధిలోని మండల కేంద్రం సి.బెళగల్ ఒకటవ సచివాలయం, మధ్యాహ్నం కంబదహాల్ గ్రామం రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏఓ మల్లేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తామని, రైతులుసద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బురాన్‌దొడ్డి విద్యార్థి



విద్యార్థి మహిధర్

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థి మహిధర్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎజీఎఫ్)లో పోటీలలో భాగంగా సోమవారం కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి హాకీ పోటీలలో మహిధర్ ఉత్తమ ప్రతిభ కనపరచాడని వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యకుమార్ తెలిపారు. నవంబర్ 8న అనకాపల్లి జిల్లా, నక్కపల్లి గ్రామంలో రాష్ట్రస్థాయిలో జరగనున్న ఎజీఎఫ్ హాకీ పోటీలలో మహిధర్ పాల్గొంటాడన్నారు. మహిధర్ తోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యకుమార్‌ను హెచ్ఎం నిర్మళ వసంత కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

నామమాత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక



పీజీఆర్ఎస్‌కు హాజరైన ఐదుగురు అధికారులు

సి.బెళగల్: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమం నామమాత్రంగా సాగుతోంది. మండల అధికారులు కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. అయితే చాలా వరకు మండల అధికారులు గైర్హాజరు అయ్యారు. కేవలం తహసీల్దార్, ఎంపీడీఓ రాణెమ్మ, ఏఓ మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి మాత్రమే హాజరయ్యారు. అనంతరం గంటలకు ఎంఈఓ జ్యోతి, ఏపీఓ రామన్న వచ్చారు. వైద్య, ఆర్అండ్‌బీ, విద్యుత్, పీఆర్, ఇరిగేషన్, వెలుగు, పశువైద్యులు గైర్హాజరయ్యారు. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చార్జీలు పెంచి మెనూ అమలు చేయండి



ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కల్లూరు: మధ్యాహ్న భోజన పథకంలో మెనూ చార్జీలు పెంచిన తర్వాతనే మెనూ అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం భోజన పథకం వంట ఏజెన్సీ నిర్వహకులతో కలిసి సీఐటీయూ నాయకులు యేసు అధ్యక్షతన ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు సాయిబాబా, సుధాకరప్ప మాట్లాడుతూ నూతన మెనూ అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, అయితే ప్రస్తుత ధలకు ఏమాత్రం కుదరదన్నారు. మెనూ చార్జీలు పెంచకుండా నూతన మెనూ అమలు చేయడం సాధ్యం కాదన్నారు. అదేవిధంగా వంట నిర్వాహకులకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాసులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం నాయకులు శ్రీరాములు, రమిజాబీ, జహారాబీ, గంగమ్మ, వెంకటేశ్వరమ్మ, నాగమణి, నాగమ్మ, రబియాబీ, ఫరిదా, శ్రీలత, సరస్వతి, జయలక్ష్మి, లలిత, రంగమ్మ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: ప్రభుత్వం అమలు చేయాలన్న మెనూకు అనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు ఎంఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన నిర్వాహకులు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమస్యలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు చినక్క, లక్ష్మీదేవి, జయంతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: విద్యారంగా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు గత ప్రభుత్వంలో వసతి దీవెన, విద్యా దీవెన , అందించి పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఎంతో కృషి చేశారన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కల్లూరు : సైబర్ నేరాలపై దూపాడు సమీపంలోని అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సీఐడీ అధికారులు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐలు ప్రసాదరావు, శ్రీధర్, శ్రీనివాసులు, గిరిబాబు మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో సీఐడీ అధికారులు, పలువురు ఎస్ఐలు, సిబ్బంది, కళాశాల డీన్ శివకుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

పాణ్యం: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాణ్యం కస్తూర్బా విద్యార్థినులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ లలితకుమారి తెలిపారు. సోమవారం కర్నూలలో ఈనెల 25,26 తేదీల్లో పాఠశాల క్రీడల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. ఇంటర్ విద్యార్థిని అర్చన, అండర్–19 విభాగం లాంగ్‌జంప్‌లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన అర్చన రూర్కండ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా 10వ తరగతి విద్యార్థినులు ఇందు, రేస్‌వాక్‌లో, చంద్రకళ షాట్‌పుట్‌లో కార్తీ పోల్‌వార్ట్ పోటీలో 3వ స్థానంలో నిలిచారన్నారు.

నేడు కొండజుటూరులో గ్రామ సభ

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహిస్తున్న డీటీ శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9గంటలకు సచివాలయం గ్రామ సభ ప్రారంభమవుతుందన్నారు. భూముల రీస సర్వేకు సంబధించిన సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

రోడ్డున పడేశారు.. ఆదుకోండి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న తమను అకారణంగా విధులనుంచి తొలగించి పొట్టకొట్టారని, ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడిన తమను ఆదుకోవాలని బాధితులు చంద్రబాబు, మద్దిలేటి, యోగేష్, సురేష్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎనిమిదేళ్లుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఉద్యోగులను వేధించడం మొదలు పెట్టిందని, జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కల్పించమని అడిగితే పని నుంచి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏజెన్సీ సూపర్‌వైజర్లు ఫిరోజ్‌ఖాన్, రవితేజ ఉద్యోగులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ పని నుంచి తొలగిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడుమూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కోడుమూరు రూరల్ : నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం చేపట్టిన 100రోజుల్లో ప్రభుత్వ విద్యా విధానంలో సమూలమార్పులు తెస్తామని యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. తల్లికి వందనం పథకం ఊసే ఎత్తకపోవడంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా పెండింగ్‌లో ఉన్న రూ.3480కోట్ల విద్యాదీవెన, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్ నాగరాజు, చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలు అందజేస్తున్న కార్మికులు

కోడుమూరు రూరల్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గూడూరు నగర పంచాయతీ కమిషనర్ నాగరాజు, చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లుకు సోమవారం సీఐటీయూ, మున్సినల్ వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు 17రోజుల సమ్మె కాలపు జీతాన్ని ఇవ్వడంతో పాటు, డ్యూటీలో ఉండి మరణించిన పారిశుద్ధ్య కార్మికుల ఎక్స్‌గ్రేసియా బకాయిలను చెల్లించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మున్సినల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి శాంతన్న, కార్మికులు సూర్య, శేఖర్, సువర్ణమ్మ, లక్ష్మీదేవి, గుంతన్న, శ్రీదేవి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్లాట్లకు నంబర్లు వేయించాలి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో పేదలకు ఇచ్చిన ప్లాట్లకు తక్షణమే నంబర్లు వేయించాలని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీటీ షర్మిలారెడ్డికి సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం నాగన్న మాట్లాడుతూ నన్నూరు గ్రామంలోని 1338/ఏ2 సర్వే నంబర్‌లో రెండవ విడత జగనన్న కాలనీలో గతేడాది పేదలకు అధికారులు ఇంటి స్థలాలు మంజూరు చేశారన్నారు. అయితే ఇంత వరకు ప్లాట్లకు నంబర్లు కేటాయించక పోవడంతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, మాసూంబాషా, సలాంబాషా, భాస్కర్, జగన్నాథం, రామచంద్రుడు, మద్దిలేటి, ఆకుల మధు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస గ్రంథం భగవద్గీత

కర్నూలు కల్చరల్: భగవద్గీత సమస్త మానవాళిని ఉద్ధరించే వ్యక్తిత్వ వికాస గ్రంథమని తెలుగు పండితులు గరుడాద్రి వనజ కుమారి అన్నారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ×రమ ఏకాదశి॰ని పురస్కరించుకొని సోమవారం సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తనను తాను సముద్ధరించుటకు భగవద్గీత గ్రంథం ఉపకరిస్తుందన్నారు. గీతా ప్రచార సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, గీతా రత్న పురస్కార గ్రహీత డీవీ రమణ మాట్లాడారు. సంఘం సభ్యులు సింహాద్రి రమేష్, రమణ, జగన్నాథ గుప్త, మహాబలేష్, పుల్లారెడ్డి, డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు (టౌన్): రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఎస్పీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి పునర్జన్మ కల్పించడమేనన్నారు. ఆపద సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం రక్తదానం చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ జ్యూస్, బిస్కెట్లు అందజేశారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



వీకర్ సెక్షన్ కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసులు

కర్నూలు (టౌన్): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సోమవారం కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 75 మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. రౌడీ షీటర్లకు, అనుమానితులకు కౌన్సిలింగ్ చేశారు. అలాగే అనుమానితుల ఇళ్లల్లో దాడులు చేశారు. వీకర్ సెక్షన్ కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు పారితోషికం అందిస్తామన్నారు. అలాగే ఎలాంటి ధ్రువపత్రాలు లేని 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ప్రవీణ్‌కుమార్, నాగరాజరావు, పవన్ కుమార్, పార్థసారధి రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెలను నాశనం చేయొద్దు



యురేనియం తవ్వకాలు ఆపాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కర్నూలు(సెంట్రల్): యురేనియం తవ్వకాల పేరిట పచ్చని పల్లెలను నాశనం చేయొద్దని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, పి.కోటకొండ, బేతపల్లి, జిల్లెడుబుడకల గ్రామాల రైతులు నిరసనకు దిగారు. ఆయా గ్రాయాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చిన రైతులు తమ గ్రామాలను నాశనం చేయొద్దని వేడుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యురేనియం తవ్వకాలు చేపడితే రైతులు సర్వనాశనం అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండే భూముల్లో యురేనియం కోసం తవ్వకాలు జరిపితే తాము ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. తమ గ్రామాలను రక్షించుకోవడానికి ఎందాకైనా సిద్ధమని, ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పారు.